హుజూరాబాద్ అభివృద్ధికి అవకాశం ఇవ్వండి



ఓటెయ్యాలని కొంగుపట్టి అడుగుతున్న షాలిని



కమలాపూర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి

- బీఆర్‌ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్/జమ్మికుంట/కమలాపూర్: హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి కోరారు. హుజూరాబాద్‌లో సోమవారం రోడ్ షో నిర్వహించారు. పదిహేనేళ్లుగా ప్రజాసేవలో ఉంటున్నానని, సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. హుజూరాబాద్ అభివృద్ధి కోసం రూ.వెయ్యి కోట్ల నిధులు తేవడంతో పాటు నాలుగు కొత్త మండలాల ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు చేసుకున్నామని, మినీస్టేడియం పనులు జరుగుతున్నాయని తెలిపారు.

కౌశిక్‌రెడ్డి సతీమణి షాలిని కంటతడి

ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడినా ప్రజల మధ్యలో ఉంటూ సేవ చేస్తూనే ఉన్నాం ఈ సారి నా భర్తకు ఓటేసి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరుతూ కౌశిక్‌రెడ్డి సతీమణి షాలిని కంటతడి పెడుతూ అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. దండం పెట్టి అడుగుతున్న మా డాడీకి అవకాశం ఇవ్వండి ప్లీజ్.. అంటూ కౌశిక్‌రెడ్డి కూతురు శ్రీనిక వేడుకున్నారు. హుజూరాబాద్‌ను హైదరాబాద్ మాదిరిగా అభివృద్ధి చేయాలనేది డాడీ కల అని, ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే హుజూరాబాద్ అభివృద్ధికి నిధులు తేవడానికి ఒత్తిడి తెస్తానన్నారు.

ఇంటింటి ప్రచారం

జమ్మికుంట పట్టణంలోని 21 వార్డులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి గెలుపు కోసం మద్దతుగా మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు సోమవారం ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ఖదీర్, శ్రీకాంత్, రుస్తుం, జాన్, వెంకటేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమపాలన

పాడి కౌశిక్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ హుజూరాబాద్ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి కోరారు. కమలాపూర్, శనిగరం గ్రామాల్లో కౌశిక్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ సుస్థిరపాలన అందిస్తున్న కేసీఆర్, బీఆర్‌ఎస్‌ను మరోసారి ఆదరించి గెలిపించాలన్నారు. బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు సంక్షేమపాలన అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎర్రం ఇంద్రసేనారెడ్డి, నాయకులు మోటం అశోక్, సాంబయ్య, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

‘కవ్వంపల్లి’ బ్రాండ్.. ఓటర్లకు బాండ్!

- ఓటర్లకు బాండ్‌పేపర్ రిలీజ్
- సోషల్ మీడియాలో వైరల్



బాండ్ పేపర్ రిలీజ్ చేస్తున్న కవ్వంపల్లి



బంక్‌లో పెట్రోలు కొడుతున్న కవ్వంపల్లి

తిమ్మాపూర్/గన్నేరువరం/శంకరపట్నం: ఎలాగైనా అధికారంలోకి రావాలని కాంగ్రెస్ నాయకులు సర్వ శక్తులు ఒడ్డుతున్నారు. టీపీసీసీతోపాటు జాతీయ నేతలు తెలంగాణపైనే ఫోకస్ పెట్టి ప్రచారం చేస్తున్నారు. ఆకట్టుకునే మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. అభ్యర్థులు ఆరు గ్యారంటీలు, మేనిఫెస్టోలు ప్రజలకు వివరిస్తూ ఓట్లు అడుగుతున్నారు. మానకొండూర్ కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ సైతం తనదైన శైలిలో ప్రచారం సాగిస్తున్నారు. ఇప్పటికే రెండుసార్లు ఓడిపోయిన కవ్వంపల్లి ఈసారి గెలుపుపై ధీమాతో ఉన్నారు.

ఓటర్లకు బాండ్ పేపర్..

కార్తీక పౌర్ణమి సందర్భంగా అల్గునూర్‌లోని శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ, గెలిచిన తర్వాత కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. ‘నీతి, నిజాయితీతో బాధ్యతలను నిర్వర్తిస్తూ ప్రగతి కోసం కృషి చేస్తా’అని పూజలు చేసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మానకొండూర్ ఓటర్లకు రాసిన బాండ్ పేపర్ కూడా రిలీజ్ చేశారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే అలుగునూర్ చౌరస్తాలోనే అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అల్గునూర్‌ను కరీంనగర్ కార్పొరేషన్‌లో కలిపిన తర్వాత అభివృద్ధి లేకుండా పోయిందన్నారు. రిజర్వేషన్ ద్వారా ఎమ్మెల్యే అయిన రసమయి బాలకిషన్ అల్గునూర్ చౌరస్తా లో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని రోడ్డు వెడల్పులో తొలిగించారన్నారు. మళ్లీ పెట్టిస్తానని పట్టించుకోలేదన్నారు. డివిజన్‌లో 360 మంది డబుల్ బెడ్‌రూం ఇళ్లకు అప్లై చేసుకుంటే 16 మందికి ఇండ్లు ఇచ్చారని, అందులో అనర్హులే ఎక్కువ ఉన్నారన్నారు. ప్రచారంలో కవ్వంపల్లి సతీమణి డా.అనురాధ, కూతురు డా.శ్రేయ, తదితరులున్నారు.

రుణమాఫీ అమల్లో ప్రభుత్వం విఫలం

రుణమాఫీ అమల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని కవ్వంపల్లి అన్నారు. గన్నేరువరం, యాస్వాడ గ్రామాల్లో ప్రచారం చేశారు. రూ.లక్ష రుణమాఫీ హామీ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌తోనే రైతు సంక్షేమం సాధ్యమన్నారు. సహకార సంఘ మాజీ చైర్మన్ కోటి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, జిల్లా కార్యదర్శి సునీల్, సర్పంచు కరుణాకర్‌రెడ్డి, ఎస్సీ, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు చంద్రారెడ్డి, అనిల్, తిరుపతిరెడ్డి, కొమురయ్య, అజయ్ పాల్గొన్నారు.

కవ్వంపల్లికి మద్దతుగా ప్రచారం

కవ్వంపల్లి సత్యనారాయణకు మద్దతుగా సీపీఐ నాయకులు గన్నేరువరం, ఖాసీంపేట, పారువెల్ల, మాదాపూర్, హన్మాజిపల్లె గ్రామాల్లో ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లోని హమాలీ సంఘాల సభ్యులను, ప్రజలను కలిసి సత్యనారాయణను భారీమెజార్టీతో గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి అంజిరెడ్డి, సహాయ కార్యదర్శి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ప్రభుత్వాన్ని ఇంటికి పంపిద్దాం

రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, ప్రభుత్వాన్ని గద్దెదించి ఇంటికి పంపాలని కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శంకరపట్నం మండలంలో తిరుగుతూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీ లను అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్నారు. ఏడాదిలో లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, రైతులకు, మహిళలకు సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. డబుల్ బెడ్‌రూం, దళితబంధు,రుణమాఫీ అందించని ఎమ్మెల్యేను 30న జరిగే ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, జంగిలి సపంపత్, ఇస్మాముద్దీన్, సదానందం, తిరుపతి, రహీం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు మేలు

- చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యం



ప్రచారంలో మాట్లాడుతున్న మేడిపల్లి సత్యం



ఆలయంలో బాండ్ పేపర్‌తో మేడిపల్లి

చొప్పదండి/గంగాధర/రామడుగు/బోయినపల్లి: ప్రజలు సంపూర్ణ మద్దతుతో ఎమ్మెల్యేగా గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యం కోరారు. చొప్పదండి మండలంలోని రాగంపేట గ్రామంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజావ్యతిరేక పాలన చేస్తున్న బీఆర్‌ఎస్‌ను గద్దె దించాలన్నారు. కాంగ్రెస్‌తోనే పేద, బడుగు, బలహీన వర్గాలకు మేలు జరుగుతుందని తెలిపారు. వెంట కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పురం రాజేశం, గుర్రం భూమారెడ్డి, కుందేళ్ళ బాలకిషన్, కళ్ళెం శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే గ్యారంటీలు అమలు

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలంలోని చర్లపల్లి ఆర్, చర్లపల్లి ఎన్, ర్యాలపల్లి గ్రామాలలో సోమవారం మేడిపల్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రెండుసార్లు పోటీ చేసి ఓడినా పదేళ్లుగా మీతోనే ఉంటూ సమస్యల పరిష్కారానికి పోరాటం చేశానన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజలకు విరక్తి పుట్టిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తుందని అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రజలు ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అధికారంలోకి రాగానే ఆసరా పెన్షన్ పెంచుతామని, గ్యాస్ సిలిండర్ ఐదువందలకు తగ్గిస్తామని, రైతుబంధు రూ.15వేలకు పెంచుతామని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని, పండించిన పంటకు క్వింటాల్‌కు రూ.ఐదు వందల బోనస్ అందిస్తామని, ఇంటి నిర్మాణానికి రూ.ఐదులక్షలు అందించడంతో పాటు స్థలం లేనివారికి 250 గజాల స్థలం ఇస్తామన్నారు. ప్రతి సంక్షేమ పథకం అర్హులైన వారందరికి అందేలా చూస్తానన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

రామడుగు సింగిల్ విండో డైరెక్టర్ మండలంలోని దేశరాజుపల్లి గ్రామానికి చెందిన గజ్జెల ఆనంద రావు నాయకులతో కలిసి సోమవారం మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మేడిపల్లి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎంపీపీ నర్సింగరావు, నాయకులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలపై ప్రజలకు నమ్మకం

చొప్పదండి నియోజకవర్గ ప్రజల సేవకోసం ఒక్కసారి అవకాశం ఇవ్వాలని మేడిపల్లి సత్యం కోరారు. బోయినపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీ పథకాల పట్ల ప్రజలకు నమ్మకం పెరిగిందని, కాంగ్రెస్ విజయం ఖాయమని తెలిపారు.

త్రిలింగ సంగమేశ్వర సన్నిధిలో బాండ్‌పేపర్

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాననే హామీతో ఉన్న బాండ్‌పేపర్‌కు విలాసాగర్ త్రిలింగ సంగమేశ్వర స్వామి సన్నిధిలో సత్యం ప్రత్యేక పూజలు చేశారు. గెలిచాక ఆరు గ్యారంటీలు అమలు చేస్తానని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవీందర్, మండల అధ్యక్షుడు రమణారెడ్డి, తదితరులు ఉన్నారు.

24 గంటలు అందుబాటులో ఉంటా..

- హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్



అఫిడవిట్‌ను చూపుతున్న పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌రూరల్: కాంగ్రెస్ గెలిచిన తర్వాత హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తానని.. ఎలాంటి అవినీతి చేయనని, 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ ప్రజలకు అఫిడవిట్ విడుదల చేశారు. సోమవారం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం మేనిఫెస్టో విడుదల చేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుతున్నారని అన్నారు. జిల్లాకు కేంద్రీయ విద్యాలయం, పాస్‌పోర్టు కేంద్రం ఏర్పాటుకు కృషి చేశానన్నారు. రైతాంగానికి తోటపల్లి రిజర్వాయర్ ద్వారా చిగురుమామిడి, సైదాపూర్ మండలాలకు, దేవాదుల ద్వారా ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు సాగు నీరు అందిస్తానని హామీ ఇచ్చారు. గౌరవెల్లి ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలను పూర్తి చేసి హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువుకు సాగు నీరు వచ్చే విధంగా అనుసంధానం చేస్తానన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టోఫర్ తిలక్, అసెంబ్లీ పరిశీలకులు గోపీనాథ్, కేడం లింగమూర్తి, చిత్తారి రవీందర్, వైస్ ఎంపీపీ దేవసాని నిర్మల నర్సింహారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కర్ర రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ప్రభుత్వాలను ఓడించాలి..

హుస్నాబాద్: ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. పొన్నం ప్రభాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి తూముల సదానందం, రాష్ట్ర కార్యదర్శి తొందూరి ఎల్లయ్య, నాయకులు తాళ్లపల్లి ఎల్లయ్య, చుంచు రమేష్, వెంకట్రాజం, జాల రవి తదితరులు పాల్గొన్నారు.



ధ్వంసమైన సీసీ రోడ్డు

శంకరపట్నం: కన్నాపూర్, ధర్మారం గ్రామాల్లో 6మాసాల క్రితం వేసిన సీసీ రోడ్లు పగుళ్ల బారిన పడ్డాయి. సుమారు రూ.50లక్షల నిధులతో నిర్మించారు. కాంట్రాక్టర్ లాభాపేక్షతో నాసిరకం పనులు చేయడంతో రోడ్లు ధ్వంసమయ్యాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఇలా జరిగిందని మండల ప్రజలు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు, క్వాలిటీ కంట్రోల్ అధికారులు పనుల నాణ్యతను పర్యవేక్షించాలని కోరుతున్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమే..



మాట్లాడుతున్న సతీశ్‌కుమార్



నాయకులు బహూకరించిన నాగలితో సతీశ్‌కుమార్

- హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్

కోహెడరూరల్(హుస్నాబాద్): మూడోసారి భారీ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని శనిగరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వరాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగిందని.. అన్నివర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేశారని కొనియాడారు. ఉద్యమ సమయంలో బీజేపీ, కాంగ్రెస్‌లు హేళన చేశాయన్నారు. వారి మాటలు నమ్మి ఓట్లు వేస్తే రాష్ట్రం అభివృద్ధికి దూరం అవుతుందని పేర్కొన్నారు. శిథిలావస్థలో ఉన్న శనిగరం ప్రాజెక్టును పునరుద్ధరించి కోహెడ, బెజ్జంకి మండలాలకు సాగు నీరు అందించామని తెలిపారు. తెలంగాణలో ఎవరు ఎన్ని కుట్రలు చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొక్కుల కీర్తి, జెడ్పీటీసీ నాగరాజు, శ్యామల మధుసూదన్, రాష్ట్ర నాయకులు శ్రీహరి, పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆవుల మహేందర్ పాల్గొన్నారు.

మూడోసారి ఆశీర్వదించండి..

హుస్నాబాద్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అభివృద్ధి కుంటుపడుతుందని రాష్ట్ర టీవీ, చలన చిత్రాభివృద్ధి సంస్థ చైర్మన్, ఎన్నారై బీఆర్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కుర్మాచలం అనిల్ అన్నారు. పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఎన్నారై విభాగం ఎన్నికల్లో కాకుండా తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ వెంట ఉండి క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్‌ను రెండుసార్లు ప్రజలు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించారని.. మూడోసారి ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో ఎన్నారై (యూకే) బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు నవీన్ రెడ్డి, ఎన్నారై (బహరెన్) బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాధారపు సతీశ్‌కుమార్, ఎన్నారైలు లక్ష్మారెడ్డి, ఇసంపల్లి రమేశ్, మధుయాదవ్, రాజ్‌కుమార్, ప్రవీణ్ పంతులు, దూస గణేశ్ ఉన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం మద్దతు

చిగురుమామిడి: హుస్నాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్ గెలుపునకు కృషి చేస్తామని మండల విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు తెలిపారు. సోమవారం చిగురుమామిడిలో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల విశ్వకర్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్‌కుమార్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రామోజు రజిత, తదితరులు పాల్గొన్నారు

దీపారాధన, సామూహిక శ్రీసత్యనారాయణస్వామి వ్రతం



చొప్పదండి: చిరుధాన్యాలతో అన్నదానం



రామడుగు: దీపాలు వెలిగిస్తున్న భక్తులు



జమ్మికుంట: శ్రీసత్యనారాయణస్వామి వ్రతంలో భక్తులు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారు వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం చిరుధాన్యాలు, సాంప్రదాయ ఆహార పదార్థాలతో భక్తులకు అన్నదానం చేశారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పట్టణంలోని సాయిబాబా ఆలయంలో పల్లకి సేవా నిర్వహించి ఉసిరి చెట్టు కింద సామూహిక భోజనాలు చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా శివకేశవాలయంలో సహస్ర దీపాలంకరణ వైభవంగా జరిగింది. శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయంలో భజన, అల్పాహార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ నిర్వాహకులు, పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని వెలిచాల శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో కార్తీక మాసం వేడుకలు దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక దీపాలంకరణ, స్వామివారి కల్యాణోత్సవాన్ని వేదపండితుల ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వీర్ల సరోజన, గ్రామస్తులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని భగవద్గీత జ్ఞాన మందిరంలో కార్తీకపౌర్ణమి పురస్కరించుకొని ఆలయ ప్రధాన అర్చకులు మరిగంటి స్వామి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య సామూహిక శ్రీసత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. దంపతులు వ్రతంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు పురం వైకుంఠం, గర్రపల్లి సతీశ్‌కుమార్, చిదురాల శ్రీనివాస్, యాంసాని రాజశేఖర్, మురికి కొండయ్య, పత్తి జనార్దన్‌రెడ్డి, కంభంపాటి శివశంకర్, తదిరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయంలో కార్తీకపౌర్ణమి పురస్కరించుకుని సోమవారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దంపతులు కార్తీకపౌర్ణమి సందర్భంగా సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్నారు. అర్చకులు మురళీధరాచార్యులు, ఆలయ చైర్మన్ మల్హర్రావు, భక్తులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలో కార్తిక పౌర్ణమి కన్నుల పండుగగా జరిగింది. మృత్యుంజయాలయం, శివాలయంతో పాటు పలు ఆలయాల్లో దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఉసిరి చెట్టుకు పూజలు చేసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మృత్యుంజయాలయంలో అర్చకుడు శర్మకు భక్తులు దీపాదానం చేశారు. అనంతం భక్తులకు ప్రత్యేక అభిషేకాలు తీర్థప్రసాదాలు అందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మానకొండూర్: సదాశివపల్లి గ్రామానికి చెందిన సంగసాని రాజిరెడ్డి(50) చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం సాయంత్రం సదాశివపల్లి శివారులో లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఘటనలో రాజిరెడ్డి, లక్ష్మయ్య గాయపడ్డారు. రాజిరెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన సోమవారం చనిపోయాడు.

బావిలో పడి యువకుడు..

సైదాపూర్: మండలంలోని బొమ్మకల్ గ్రామంలో ఈ నెల 25న ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి పూరెల్ల నాగరాజు (23) మృతిచెందినట్లు సైదాపూర్ పోలీసులు సోమవారం తెలిపారు. బొమ్మకల్‌కు చెందిన నాగరాజు 25న నోముల పండుగ సందర్భంగా పువ్వులు, పాలు తీసుకొస్తానని ఉదయం నాలుగున్నర గంటల ప్రాంతంలో పొలం వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడిపోయాడు. ఈక్రమంలో నాగరాజు పడిపోయిన వ్యవసాయ బావికి సంబంధించిన కౌలు రైతు సోమవారం పనుల నిమిత్తం బావి వద్దకు వెళ్లగా దుర్వాసన రావడంతో అందులోకి తొంగిచూశాడు. దీంతో నాగరాజు మృతదేహం కనిపించింది. నాగరాజు మృతిపై ఎలాంటి అనుమానం లేదని అతడి పినతండ్రి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం పట్టివేత

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పర్కాల్ క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం వాహనాల తనిఖీల్లో భాగంగా అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టుకున్నామని ఎక్సైజ్ సీఐ దుర్గాభవానీ తెలిపారు. ద్విచక్ర వాహనంపై ఎల్కతుర్తి మండలం జిలుగుల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన మాట తప్పదు

- కాంగ్రెస్ హుజూరాబాద్ అభ్యర్థి ప్రణవ్



రోడ్ షోలో మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు

ఇల్లందకుంట/జమ్మికుంట/హుజూరాబాద్‌రూరల్: ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి దేవస్థానం సాక్షిగా కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేస్తానంటూ కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ అభ్యర్థి వొడితెలప్రణవ్ ఆలయ ప్రాంగణంలో బాండ్ పేపర్‌పై సంతకం చేశారు. ఆలయంలో సోమవారం పూజలు నిర్వహించిన అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ మాటిస్తే తప్పదని, రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌కు అవకాశమివ్వండి

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు అవకాశమివ్వండని మేనిఫెస్టో కమిటీ చైర్మన్, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. జమ్మికుంట పట్టణంలోని గాంధీచౌక్ వద్ద వొడితెల ప్రణవ్‌కు మద్దతుగా నిర్వహించిన రోడ్ షోలో ప్రసంగించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను బీఆర్‌ఎస్ కాపీ కొట్టిందన్నారు. జమ్మికుంట పట్టణం పెద్ద వ్యాపార, వాణిజ్య కేంద్రం, వ్యాపారులకు ఇబ్బంది రాకుండా ప్రణవ్ చూసుకుంటాడని హామీ ఇచ్చారు. హుజూ రాబాద్‌ను పీవీ జిల్లా ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

ఆరు గ్యారెంటీలు పక్కాగా అమలు

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలు పక్కాగా అమలు చేస్తుందని కర్ణాటక రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండురావు అన్నారు. హుజూరాబాద్‌రూరల్ మండలం సింగాపూర్‌లో సోమవారం మాట్లాడారు. ప్రణవ్ గెలుపు ఖాయమన్నారు. రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం దోచుకుంటుందన్నారు. కాంగ్రెస్ 75 సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఐదు రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతుందని, భారత్ జోడో యాత్రతోనే పార్టీ పుంజుకుందన్నారు. కర్ణాటక ఎమ్మెల్సీ విజయ్‌సింగ్, వొడితెల శ్రీనివాస్‌రావు, కిషన్‌రావు, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



తిరుమలకు శివరామకృష్ణ భక్తజన మండలి బృందం

శంకరపట్నం: మండలంలోని శివరామకృష్ణ భక్తజన మండలి బృందం సభ్యులు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దేవాయలంలో అఖండ హరినామ సంకీర్తనలు ఆలపించడానికి ఎంపికయ్యారని ఆంజనేయస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ తణుకు ఓంకారం తెలిపారు. ఈసందర్భంగా సోమవారం కేశవపట్నం ఆంజనేయస్వామి ఆలయంలో భజన మండలి బృందం సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తిరుమలకు బయలుదేరారు.